# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 167 | శనివారం 21, ఫిబ్రవరి 2126 | పేజీలు: 03 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## యూరియా యాప్‌ను రద్దు చేయాలి

- ఎలాంటి షరతులు లేకుండా సరఫరా చేయాలి
- ప్రభుత్వానికి కనీస సోయి లేకపోవడం సిగ్గు చేటు
- ఏపీకి నీళ్లు వదిలేందుకే దేవాదుల మోటార్లు బంద్ పెట్టారా?
- మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్న



తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం:

యూరియా యాప్‌ను రద్దు చేసి, పాత విధానంలో ఎలాంటి షరతులు లేకుండా రైతులకు యూరియా సరఫరా చేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. యూరియా కష్టాలు భరించని రైతులు మీ ప్యాలెస్‌లను ముట్టడించే రోజులు వస్తాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం ఎక్స్ వేదికగా రైతుల యూరియా కష్టాలపై హరీశ్ ధ్వజమెత్తారు. షాపుల్లో అమ్మాల్సిన యూరియాను యాపుల్లో ఇస్తామని ఆర్భాటం చేశారని, రైతుల ఆక్రందన మీకు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. ఒక్క యాదాద్రి భువనగిరి జిల్లాలోనే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరిదీ ఇదే పరిస్థితి అని అన్నారు. యూరియా కోసం రైతులు చెప్పులు లైన్‌లో పెట్టే ఆనాటి రోజులు తేవడమేనా మీరు చెప్పిన మార్పు అని నిలదీశారు.

**ఏపీకి నీళ్లు వదిలేందుకే దేవాదుల మోటార్లు బంద్ పెట్టారా?**

దేవాదుల ప్రాజెక్టులో భాగమైన వరంగల్ జిల్లా దేవన్నపేట పంప్ హౌజ్‌లను హరీశ్ రావు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, దేవాదులలో భాగమైన దేవన్నపేట వద్ద ఉన్న మూడు పంపులు పరిశీలించామని, లోపలికి వెళ్లి చూస్తే పని చేయడం లేదని అన్నారు. ఒక వైపు గోదావరిలో కావాల్సినంత నీటి ప్రవాహం ఉన్నదని,
సమ్మక్క సాగర్ దగ్గర 16 వేల క్యూసెక్కుల నీరు పారుతున్నాయని చెప్పారు. కావాని ప్రభుత్వం దేవన్నపేట పంపు హౌజ్ మోటార్లను ఆఫ్ చేసి పెట్టిందని విమర్శించారు. గత సంవత్సరంలో ఈ పంపులు ఆన్ చేయకపోవడం వల్ల 60 వేల ఎకరాల్లో పంట ఎండిపోయిందని ఆరోపించారు. జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్ పూర్‌లలో నీళ్లు లేవని, గండిరామారం లిఫ్టులు ఆగిపోయాయని విమర్శించారు. కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల దేవాదుల నీళ్లు అందక వరంగల్ జిల్లా రైతులకు తీవ్రమైన అన్యాయం జరుగుతున్నదని అన్నారు. ఆ రోజైనా, ఈ రోజైనా రైతులకు అన్యాయం చేసింది కాంగ్రెస్ అని, దేవాదుల ప్రాజెక్టును పట్టించుకోలేదని విమర్శలు చేశారు. సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీలు కలిసి దేవాదుల కింద ఇచ్చిన ఆయకట్టు కేవలం 47 వేల ఎకరాలే అని బీఆర్ఎస్ 3 లక్షల 17 వేల ఎకరాలకు పెంచిందని గుర్తు చేశారు. రెండున్నరేండ్లలో ఒక్క ఎకరాకు అదనంగా నీళ్లు ఇవ్వలేదని ఆరోపించారు.

**విశ్రాంత ఎస్సై మృతి బాధాకరం**

ప్రభుత్వ నిర్లక్ష్యంతో రిటైర్మెంట్ డబ్బుల కోసం ఎదురుచూస్తూ విశ్రాంత ఎస్సై మైసయ్య మృతి చెందడం బాధాకరం అని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సరెండర్ లీవ్స్ లేవు. 'ఆరోగ్య భద్రత' అటకెక్కింది. స్టేషన్ల నిర్వహణకు నిధుల్లేవు అని అన్నారు. విశ్రాంత ఎస్సై మృతి ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యే అని ఆరోపించారు. ఖమ్మం జిల్లాకు చెందిన విశ్రాంత ఏఆర్ ఎస్సై మైసయ్య రిటైర్మెంట్ బకాయిలు అందక, ఆసుపత్రి ఖర్చులకు డబ్బుల్లేక ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. జీవితకాలం ప్రజల రక్షణ కోసం అహర్నిశలు శ్రమించిన ఒక పోలీస్ అధికారి దుస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తక్షణమే మరణించిన ఎస్సై మైసయ్య కుటుంబానికి రావాల్సిన బకాయిలతో పాటు, ప్రత్యేక ఎక్స్ గ్రేషియా చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

- తృటిలో తప్పిన పెను ప్రమాదం
- ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో ఘటన
- భవనం విద్యుత్ కేబుళ్ల బోర్డులో మంటలు
- ప్రమాద సమయంలో భవనంలో 50 మంది
- సురక్షితంగా రక్షించిన హైడ్రా డీఆర్ఎఫ్
- భవనాల్లో ఫైర్ సేఫ్టీ లోపాలపై చర్చ





తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం:

హైదరాబాద్ నగరంలోని అమీర్‌పేట ప్రాంతంలో శుక్రవారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అప్రమత్తంగా స్పందించిన హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు మంటలను త్వరగా అదుపులోకి తీసుకువచ్చి భవనంలో చిక్కుకున్న 50 మందికి పైగా వ్యక్తులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చాయి. పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.
అమీర్‌పేటలోని ఆదిత్య ఎన్‌క్లేవ్ సముదాయంలోని నీలగిరి బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో విద్యుత్ కేబుళ్లు ఉన్న ప్యానల్ బోర్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఉదయం 11:01 గంటలకు ఈ సమాచారం హైడ్రా కంట్రోల్ రూమ్‌కు చేరిందని అధికారులు తెలిపారు. వెంటనే ఫీల్డ్‌లో ఉన్న డీఆర్ఎఫ్ బృందాలకు అలర్ట్ పంపించారు. సమీపంలో ఉన్న సిబ్బంది కేవలం మూడు నిమిషాల్లో, 11:04 గంటలకు ఘటనాస్థలికి చేరుకుని ఫైర్ ఎక్స్టింగ్విషర్లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.
మంటలను ఆర్పడంతో పాటు సహాయక చర్యలు కూడా ఒకేసారి ప్రారంభించారు. మెట్ల మార్గం వద్దే విద్యుత్ కేబుళ్లు తగలబడడంతో భారీగా పొగలు కమ్ముకున్నాయి. దీంతో రెండో అంతస్తులో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడం సవాలుగా మారింది. అయితే హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బంది తమ వద్ద సిద్ధంగా ఉన్న రోప్ ల్యాడర్ల సాయంతో ఒక్కొక్కరిని సురక్షితంగా కిందకు దించారు. కొద్దిసేపటికి మరో రెండు బృందాలు ఘటనాస్థలికి చేరాయి. ఫైర్ సిబ్బంది, పోలీసులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సమన్వయంతో పనిచేయడంతో ఎవరికీ ప్రాణహాని జరగలేదని అధికారులు తెలిపారు. మంటలను అదుపు చేయడంలో కాస్త ఆలస్యం అయినా పెద్ద ప్రమాదం సంభవించే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు.
అమీర్‌పేట ప్రాంతం ఐటీ శిక్షణ కేంద్రాలు, కోచింగ్ ఇన్‌స్టిట్యూట్లకు కేంద్రంగా ప్రసిద్ధి. మైత్రీవనం, ఆదిత్య ఎన్‌క్లేవ్ భవనాల్లో వందలాది శిక్షణా కేంద్రాలు పనిచేస్తున్నాయి. ప్రతి అంతస్తులో పలు ఇన్‌స్టిట్యూట్లు ఉండడంతో ఎప్పుడూ విద్యార్థులతో రద్దీగా ఉంటుంది. అలాంటి ప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవించడం నగరాన్ని కలవరపరిచింది. సమాచారం తెలిసిన వెంటనే నగర వాసులు అప్రమత్తమయ్యారు. హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు వేగంగా స్పందించి మంటలను ఆర్పడంతో పాటు పై అంతస్తుల్లో ఉన్న వారిని రక్షించడం అందరినీ ఆకట్టుకుంది. సిబ్బంది చురుకుదనాన్ని పలువురు అభినందించారు.
ఘటనాస్థలిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా పరిశీలించారు. మంటలు ఎలా చెలరేగాయి? భవనంలో ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? అనే అంశాలపై వివరాలు సేకరించారు. హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, ఏడీఎఫ్‌వో మోహనరావు తదితరులు కూడా ఘటనాస్థలిని పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ, క్షణాల్లో స్పందించిన డీఆర్ఎఫ్ సిబ్బంది వల్లే పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఫైర్, పోలీస్ విభాగాలు సమన్వయంతో పనిచేయడంతో ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. ఇటీవలి కాలంలో వరుసగా అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఇది అందరికీ హెచ్చరికగా తీసుకోవాలని సూచించారు.
నెల రోజుల క్రితం ఫైర్, జీహెచ్ఎంసీ, విద్యుత్, పోలీస్ విభాగాలతో కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహించామని, ఫైర్ సేఫ్టీ లోపాలు ఉన్న కొన్ని దుకాణాలను సీజ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. భద్రతా చర్యలు తీసుకోవడానికి గడువు కూడా ఇచ్చామని తెలిపారు. మళ్లీ త్వరలో సంయుక్త తనిఖీలు చేపట్టి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫైర్ చట్టాల్లో మార్పులు అవసరమైతే సంబంధిత శాఖలతో చర్చించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని కమిషనర్ తెలిపారు. భవన యజమానులు, నిర్వాహకులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా పాటించాలని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావడానికి మార్గాలు ఖాళీగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.
అగ్నిప్రమాదం సమయంలో భయపడకుండా, సురక్షిత మార్గాలను అనుసరించాలి అని అధికారులు ప్రజలకు సూచించారు. ఎలాంటి ప్రమాదం జరిగినా వెంటనే అత్యవసర సేవలకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అమీర్‌పేటలో చోటుచేసుకున్న ఈ అగ్నిప్రమాదం క్షణాల్లో అదుపులోకి రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వేగంగా స్పందించిన హైడ్రా డీఆర్ఎఫ్, ఫైర్, పోలీస్ బృందాల చర్యలతో 50 మందికి పైగా సురక్షితంగా బయటపడడం నగరానికి ఊరట కలిగించింది. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని అధికారులు స్పష్టం చేశారు.

## కవితను లైట్ తీసుకోవడమే బెటరని బీఆర్ఎస్ నేతలు డిసైడయ్యారా?

- కవిత గురించి బీఆర్ఎస్‌లో ఆసక్తికరమైన చర్చలు
- మున్సిపల్ ఎన్నికల్లో కవిత ప్రభావంపై విశ్లేషణలు
- భయపడాల్సిన అవసరం లేదని క్లారిటీ వచ్చేసిందా?
- అక్కడక్కడా పార్టీని దెబ్బ తీస్తారని మొదట్లో ఆందోళన

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం:

అనవసరంగా ఎక్కువ భయపడ్డాం... చాలా ఊహించేసుకున్నాం...అందుకే అవసరమైనదాని కంటే ఒకింత ఎక్కువ జాగ్రత్తపడ్డాం. కానీ...అంత సీన్ లేదని తేలిపోయింది. లైట్ తీస్కో బాసూ...డోంట్ వర్రీ. ప్రస్తుతం బీఆర్ఎస్ సర్కిల్స్‌లో ఏ ఇద్దరు ముఖ్యులు కలిసినా ఇలాగే మాట్లాడుకుంటున్నారట. ఇంతకీ ఇన్నాళ్ళు ఏ విషయంలో భయపడ్డారు వాళ్ళంతా? ఇప్పుడా భయం ఎందుకు పోయింది? ఎవర్ని లైట్ తీసుకోవాలనుకుంటున్నారు? తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాజకీయంగా చాలా ప్రశ్నలకు సమాధానం చెప్పాయి. పార్టీ గుర్తుల మీద జరిగిన లోకల్ పోరులో ఎవరి బలమేంటో తేలిపోయింది. పైకి ఎవరెన్ని బింకాలు పలికినా...అంతర్గత విశ్లేషణల్లో మాత్రం వాస్తవాల గురించి మాట్లాడుకుంటూ జరిగిన లాభ నష్టాలు, ఇక మీదట తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అన్ని పార్టీల్లో మాట్లాడుకుంటున్నారట. ఈ క్రమంలోనే...బీఆర్ఎస్‌లో ఒక ఇంట్రస్టింగ్ డిస్కషన్ నడుస్తోందట. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వల్ల మనకు ఏదన్నా డ్యామేజ్ అయిందా? కారు గుర్తు మీద ఆమె ప్రభావం ఏమన్నా ఉందా అంటూ రకరకాల విశ్లేషణలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. వాటి సారాంశమే భయపడాల్సిన పని లేదన్న కన్‌క్లూజన్ అంటున్నాయి పార్టీ వర్గాలు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరపున పోటీ చేశారు కొందరు కవిత అనుచరులు. ఎక్కడా వాళ్ళ ప్రభావం తమ మీద లేదన్న నిర్ధారణకు వచ్చారట బీఆర్ఎస్ పెద్దలు. పార్టీ నుంచి బయటికి వెళ్ళిపోయాక కవిత మాట తీరు, ఆమె దూకుడు చూసి... ఈ ఎన్నికల్లో ఆమె ప్రభావం ఎంతోకొంత ఉంటుందని, అక్కడక్కడా గెలుపు అవకాశాలు దెబ్బతింటాయేమోనని భయపడ్డారట బీఆర్ఎస్ లీడర్స్.



## కార్పొరేషన్లలో ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

- 40 రోజుల్లో సమూల మార్పులు చేస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ
- నిజామాబాద్ మేయర్ ప్రమాణ స్వీకారం
- హాజరైన మంత్రి, టీపీసీసీ చీఫ్



తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం:

రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. రానున్న 40 రోజుల్లో దీనిపై స్పష్టమైన కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. శుక్రవారం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా కూరగాయల ఉమారాణి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర కేబినెట్ మొత్తం కార్పొరేషన్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. "వచ్చే 40 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లలో ఉపాధి అవకాశాలు పెంచేలా, మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేలా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందించారు. అదే స్ఫూర్తితో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పార్టీని ఆదరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు" అని ఆయన అన్నారు.
తెలంగాణ రాష్ట్రం 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే లక్ష్యంతో ఏర్పడిందని, ఆ దిశగానే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. "విజన్ 2047" లక్ష్యంతో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెడతామని ధీమా వ్యక్తం చేశారు.

**కేంద్రం సహకరించాలి: బీజేపీకి చురకలు**

తెలంగాణ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ పాత్ర కూడా ఉండాలని మంత్రి పొన్నం గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడి పన్నెండేళ్లు గడుస్తున్నా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష చూపుతోందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడి బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కేవలం రాజకీయాలు చేయడం మానేసి, రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు తీసుకురావాలని సూచించారు. సోనియా గాంధీ చొరవతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, ఈ సందర్భంగా ఆమెకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

**ఉద్యమకారులకు అండగా ఉంటాం**

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం గౌరవిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు ఇచ్చిన మాట ప్రకారం 250 గజాల నివాస స్థలాన్ని కేటాయిస్తామన్నారు. "ఉద్యమ సమయంలో జైలుకు వెళ్లిన వారు, కేసులు ఎదుర్కొన్న వారిని ఆదుకోవడానికి మంత్రివర్గ సబ్ కమిటీని ఏర్పాటు చేశాం. మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని నెరవేరుస్తాం" అని స్పష్టం చేశారు.

## ఒక్క ఛాన్స్ ప్లీజ్



- రెండు రాజ్యసభ సీట్లు ఖాళీ, జోరుగా లాబీయింగ్
- ఖచ్చితంగా ఒకటి అధిష్టానం కోటాలోకి?
- అభిషేక్ మను సింఘ్వినే తిరిగి కొనసాగిస్తారా?
- రాష్ట్రానికి సంబంధించిన కేసుల్లో కీలకంగా సింఘ్వి

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం:

తెలంగాణ నుంచి రాజ్యసభ రేస్‌లో ఉన్న నాయకులు ఎవరు? ఉన్న రెండు సీట్లలో ఒకటి ఆల్రెడీ రిజర్వ్ అయిపోయిందన్నది నిజమేనా? అదే నిజమైతే... ఎవరి కోసం రిజర్వ్ చేశారు? మిగిలి ఉన్న ఒక్క సీటు కోసం ఎంతమంది పోటీ పడుతున్నారు? ఎవరి అడ్వాంటేజ్ ఏంటి? అసలు ఢిల్లీ పెద్దల మనసులో ఏముంది? తెలంగాణ నుంచి రెండు రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతున్నాయి. సహజంగానే.... ఆశావహుల ట్రయల్స్ మొదలైపోయాయి. కాంగ్రెస్ నేతలు ఎవరికి వారు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ మొదలెట్టేశారట. అధిష్టానం దగ్గర ఇటీవల జరిగిన తెలంగాణ కాంగ్రెస్ నేతల సమావేశంలో కూడా రాజ్యసభ ఎన్నికలపై చర్చ జరిగినట్టు తెలిసింది. ప్రస్తుతం ఖాళీ అయిన రెండు సీట్లలో ఒకటి కచ్చితంగా అధిష్టానం కోటాలోకి వెళ్తుంది. ఆ లెక్కన చూస్తే...ప్రస్తుతం ఎంపీగా ఉన్న పార్టీ సీనియర్ అభిషేక్ మనుసింఘ్వినే కొనసాగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. రాష్ట్రానికి సంబంధించిన అనేక కేసుల విషయంలో ఆయన అవసరం చాలా ఉన్నట్టు చెబుతున్నారు. పైగా... హైకమాండ్‌కు ఆయన చాలా దగ్గర వ్యక్తి. అందుకే సింఘ్విని కొనసాగించేందుకు ఢిల్లీ పెద్దలు కూడా సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో ఎన్నిక జరిగే రెండిటిలో ఇక ఒక సీటే మిగులుతుంది. దాని కోసం రేస్‌లో చాలామందే ఉన్నారు.
దీంతో... ఎంపిక ఏ ప్రాతిపదికన జరుగుతుందన్న చర్చలు జోరుగా నడుస్తున్నాయి. పార్టీ కోసం లాయలిస్టులుగా ఉన్న వాళ్లకు అవకాశం ఇస్తారా..? అధిష్టానం ఏం నిర్ణయిస్తే అదే ఫైనలా లేక స్టేట్ ప్రయారిటీస్ ఉంటాయా లాంటి రకరకాల ప్రశ్నలు వస్తున్నాయి. ఎంపిక ప్రక్రియపై రాష్ట్ర నాయకత్వం కసరత్తు మొదలుపెట్టిన క్రమంలో....పార్టీ వర్గాల్లో రకరకాల పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. ఇందులో మొదటి వరుసలో ఉన్నారు పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు. రాజ్యసభ సీటు విషయమై సీఎం రేవంత్ రెడ్డి ఆనకు మాట ఇచ్చారన్న ప్రచారం కూడా జరుగుతోంది. వీహెచ్‌కే రాజ్యసభ టికెట్ ఇవ్వాలంటూ రాహుల్ గాంధీని కోరేందుకు ఆల్రెడీ ఢిల్లీ వెళ్ళారు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి. పార్టీకి లాయల్.. పార్టీ కోసం ఈ వయస్సులో కూడా పని చేస్తున్న విహెచ్‌కు గౌరవం దక్కాల్సిందేనంటూ వత్తిడి పెంచే పనిలో ఉన్నారు జగ్గారెడ్డి. బీసీ కోటాలో హనుమంతరావుకు అవకాశం ఇస్తే పార్టీ ఇప్పుడు అందుకున్న బీసీ నినాదానికి మరింత బలం చేకూర్చినట్టు అవుతుందన్న మాటలు కూడా వినిపిస్తున్నాయి. ఇదే బీసీ కోటాలో మరో సీనియర్ నేత మధు యాష్కీ కూడా ప్రయత్నాలు మొదలుపెట్టారు.



# ఐకేపీ గ్రామ కమిటీ భవనం నిర్మాణానికి భూమి పూజ...

**తూప్రాన్ ఫిబ్రవరి 20 (ప్రజస్వరం ) :**

మనోహబాద్ మండలం లింగారెడ్డి పేట్ లో ఐకేపీ గ్రామ కమిటీభవననిర్మాణ నికి భూమి పూజ చేసిన సర్పంచ్ శివగోని పెంట గౌడ్ గ్రామ వి ఓ మంజుల గౌడ్ ప్రతి నెల ఐకేపీ మహిళా గ్రూప్ సభ్యులు సమావేశం కోసం ఈ భవనం ఎంతగానో ఉపయోగ పడుతుంది అని సర్పంచ్ అన్నారు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో భవనం నిర్మాణం పూర్తి చేసి తొందరగా ఐకేపీ సభ్యులకు అప్పగించి ప్రారంభం చేస్తాం అని ఆయన అన్నారు ఈ కార్యక్రమం గ్రామ ఐకేపీ గ్రూప్ ల సభ్యులు పాలక వర్గం గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు

# ఎంఈఓగా మధుసూదన్ బాధ్యతలు

**మాసాయిపేట ఫిబ్రవరి 20 ప్రజాస్వరం**



మాసాయిపేట మండల ఎంఈఓగా మధుసూదన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎం ఈ ఓ గా బాధ్యతలు స్వీకరించినందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చేస్తానని అన్నారు. విధి నిర్వహణలో భాగంగా నిత్యం ప్రభుత్వ పాఠశాలను పర్యవేక్షిస్తానాని అన్నారు. అనంతరం వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు,ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తదితరులు అభినందనాలు తెలిపారు.

# తెలుగు భాష గొప్పతనం

**హైదరాబాద్, ఫిబ్రవరి 20,ప్రజా స్వరం**

**తెలుగు అంటే ఒక వెలుగు**
**అమ్మ భాష తెలుగుభాష**
**కమ్మనైన భాష తెలుగు**
**అమ్మ నేర్పిన అమ్మ భాష తెలుగు!!**
**తీయనైన భాష తెలుగు భాష**
**అమ్మ ఒడిలోన పలికే తెలుగు భాష**
**తెలుగు భాష పాటల ఊట**
**సకల కళలకు పూదోట తెలుగు భాష!!**
**నలుగురు మెచ్చే నా తెలుగు భాష**
**బహు చక్కనైన నా తెలుగు భాష**
**అందరినీ ఒక్కటి చేసే నా తెలుగు భాష**
**ఆత్మగండ్ల భాష నా తెలుగు!!**
**స్వచ్ఛమైన తెలుగు భాష**
**అందమైన మన తెలుగు భాష**
**సంస్కృతి సాంప్రదాయాలకు నిలయం**
**తెలుగు భాష**
**అందమైన ప్రపంచంలో అందమైన భాష**
**తెలుగు!!**
**అమృతం లాంటి అమ్మ భాష తెలుగు**
**ఆనందాన్ని ఇచ్చే తెలుగు భాష**
**ఆత్మ బంధువు లాంటి భాష తెలుగు**
**వెన్నెల లాంటి వెలుగునిచ్చే తెలుగు భాష**
**అవని లో అమ్మ భాష గొప్పది!!**

**అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా**
**రచన**
**దేవులపల్లి రమేశ్,**
**కలం :వామిక శ్రీ**
**నంగునూర్, సిద్దిపేట**
**9963701294.**



# వీధి కుక్క దాడి మహిళా కు గాయాలు...

**మెదక్ ఫిబ్రవరి 20 (ప్రజా స్వరం)**

వీధి కుక్క దాడిలో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన మెదక్ పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే పట్టణంలోని 26 వ వార్డు శాంతి నగర్ లో వీధి కుక్క కరవడంతో తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్థానిక కౌన్సిలర్ దీపక్ కుమార్ బాధితురాలిని మెదక్ ఏరియా హాస్పిటల్ కి తరలించారు. అనంతరం స్థానిక కౌన్సిలర్ దీపక్ కుమార్ మాట్లాడుతూ 26 వ వార్డు లోని ఆజంపుర, శాంతినగర్ లో వందల సంఖ్యలో కుక్కలు బీభత్సం సృష్టిస్తున్నాయని మహిళలు, వృద్ధులు, పిల్లలు పాఠశాలలకు వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మున్సిపల్ కమిషనర్ స్పందించి కుక్కలను, కోతులను, నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం సైతం అందజేసినట్లు తెలిపారు.





# బీరంగూడ గుట్టపై మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘన విజయం

- **హుండీ ఆదాయం రూ.8.62 లక్షలు – మొత్తం ఆదాయం రూ.80.92 లక్షలు**

**అమీన్ పూర్, ఫిబ్రవరి 20(ప్రజా స్వరం )**

శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు భక్తుల అపార విశ్వాసంతో అంగరంగ వైభవంగా ముగిశాయి. జాతర సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం దేవస్థానం చైర్మన్ బైసా సుధాకర్ యాదవ్, ఈవో శశిధర్ గుప్తా ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రంగారావు సమక్షంలో నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా హుండీ ద్వారా రూ.8,62,677 ఆదాయం లభించింది. అదేవిధంగా దర్శనం టికెట్లు, టెండర్లు, అన్నదాన విరాళాలు కలిపి మొత్తం రూ.80,92,132 సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. స్వామి అమ్మవార్లపై భక్తుల అచంచల విశ్వాసానికి ఇది నిదర్శనమని తెలిపారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయం, పరిశుభ్రత కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేశారు. ఈ మహోత్సవాల విజయానికి సహకరించిన పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ, మున్సిపల్ సిబ్బంది, ఎమ్మార్వో కార్యాలయం, దాతలు, వాలంటీర్లు, మీడియా ప్రతినిధులు మరియు భక్తులందరికీ దేవస్థానం కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.











## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం
# భూమి పూజలు....

- **నర్సారెడ్డి మాజీ ఎమ్మెల్యే**

**తూప్రాన్ ఫిబ్రవరి 20 (ప్రజా స్వరం)**

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ లో పేదలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు అయినా లబ్ధిదారులకు భూమి పూజ చేసుకో కొబ్బరికాయలు కొట్టిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తూముకుంట నర్సారెడ్డి పేదలకు రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు ఆసక్తిగా ఉన్నారని అర్హులైన పేదలు ఇందిరమ్మ ఇల్లు ల కోసం దరఖాస్తు చేసుకోవాలని నర్సారెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోడిపాక నారాయణ గుప్తా నాచారం ఆలయ చైర్మన్ పల్లెల రవీందర్ గుప్తా మాజీ కౌన్సిలర్లు నంద్యాల శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు మామిళ్ల కృష్ణ చిన్న నాగరాజుగౌడ్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు





# ప్రజలు దుష్ప్రచారాలను నమ్మొద్దు...

**మెదక్ ఫిబ్రవరి 20 (ప్రజా స్వరం)**

నూతన ఉపాధి హామీ పథకం వి బి జి రామ్ జి అనే చట్టానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరుతూ మెదక్ జిల్లా బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. నూతన ఉపాధి హామీ పథకం గురించి దుష్ప్రచారాలను నమ్మొద్దనీ, మోడీ నాయకత్వాన్ని బలపరచి వికసిత భారత్ లక్ష్యంగా వి బి జి రామ్ జి అనే చట్టానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు, రామాయంపేట కౌన్సిలర్ శంకర్ గౌడ్, మెదక్ జిల్లా బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్ జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, నగేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# కొలువుదిరిన నూతన పాలకవర్గం..

- **మున్సిపల్ చైర్పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా..**

**రామాయంపేట, ఫీబ్రవరి 20 ( ప్రజా స్వరం )**



రామాయంపేట మున్సిపల్ నూతన పాలకవర్గం సభ్యులు శుక్రవారం పదవి బాధితులు స్వీకరించారు. ఇటీవల జరిగిన రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన మున్సిపల్ చైర్పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా పదవి బాధ్యతలు స్వీకరించారు. మొట్టమొదటిసారిగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన పాలకవర్గం సభ్యులకు అధికారులు ఘనస్వాగతం పలికారు. డోలు సన్నాయి వాయిద్యాల మధ్య స్వాగతం పలికిన అనంతరం వేద పండితులచే కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తొలి సంతకం చేసి చైర్పర్సన్ గా గజవాడ లావణ్య నాగరాజు తన బాధ్యతల స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో రామాయంపేట మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని 12 వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, రెండవ వార్డ్ కౌన్సిలర్ ప్రవీణ్, మూడవ వార్డు కౌన్సిలర్ రవి నాయక్, నాలుగవ వార్డ్ కౌన్సిలర్ బైరం స్వప్న, ఐదవ వార్డ్ కౌన్సిలర్ చౌదరి చరిత, ఆరవ వార్డ్ కౌన్సిలర్ పుట్టి సందీప్, ఏడవ వార్డ్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్తా, 8వ వార్డు కౌన్సిలర్ జంగంపల్లి శివశంకర్, 9వ వార్డు కౌన్సిలర్ దేవుని రంజిత్, పదవ వార్డు కౌన్సిలర్ మద్దెల మాధవి, 11వ వార్డు కౌన్సిలర్ దాకీ శ్యామల, మున్సిపల్ మేనేజర్ రఘువరన్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.





# సాగునీరు కోసం రోడ్డుపై రాస్తారోకో చేపట్టిన రైతులు..

- **పురుగుల మందు డబ్బాలతో రహదారిపై ఆందోళన..**
- **సాగునీరు అందించే వరకు నిరసనలు ఉద్ధృతం చేస్తామన్న రైతులు..**

**చేగుంట, ఫిబ్రవరి 20 ( ప్రజా స్వరం )**

చేగుంట మండలం పులిమామిడిగజ్వేల్ ప్రధాన రహదారిపై నిజాంపేట్ మండలం కె.వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతులు కొండపోచమ్మ ప్రాజెక్టు ద్వారా సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. సమయానికి నీరు అందక వరి, మక్క, కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నుంచి నీటిని వదలాలని ఎన్నిసార్లు కోరినా స్పందించకపోవడంతో ఆందోళనకు దిగామని రైతులు తెలిపారు. వెంటనే నీరు విడుదల చేయకపోతే నిరసనలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. రాస్తారోఖో కారణంగా రహదారికి ఇరువైపుల భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది, సమాచారం తెలుసుకున్న చేగుంట తహసీల్దార్ శివప్రసాద్, ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. సమస్యను ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే నీటిని విడుదల చేయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు.

# ఆదిలాబాద్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో అకాడమిక్ పరిశీలన

**ఆదిలాబాద్ జిల్లా ఫిబ్రవరి 20 (ప్రజాస్వరం):-**

SSA Adilabad ఆధ్వర్యంలో శుక్రవారం అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్, ఆదిలాబాద్‌లో అకాడెమిక్ పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా AMOగా వ్యవహరిస్తున్న బి. లక్ష్మణ్ గారు, అసిస్టెంట్ AMO అజయ్ గారు పాఠశాల నిర్వహణ, బోధనా విధానాలపై సమగ్రంగా పరిశీలన చేపట్టారు. తరగతి గదుల్లో జరుగుతున్న బోధనను ప్రత్యక్షంగా వీక్షించిన అధికారులు, ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల బోధనలో మరింత నాణ్యత సాధించేందుకు అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని పెంపొందించేందుకు అనుసరించాల్సిన విధానాలపై మార్గదర్శకాలు అందించారు. అదేవిధంగా పాఠశాల వంటగది, స్టోర్ రూమ్‌ను పరిశీలించి పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. పాఠశాల నిర్వహణ, క్రమశిక్షణ, విద్యా ప్రమాణాల పట్ల అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ సిబ్బంది కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ప్రశాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు రవికాంత్ రెడ్డి, గణేష్, హారిక పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రికి " దుబ్బాక " పై ఇంత వివక్షనా..?

- మల్లన్న సాగర్ పై ఆధారపడి ఉన్నారు..
- నీళ్ల మంత్రి జిల్లా పర్యటించిన దాఖలాలు లేవు
- త్వరలో రైతులు సీఎం కార్యాలయ ముట్టడికి సిద్ధంగా ఉన్నారు



**దుబ్బాక, ప్రజా స్వరం , ఫిబ్రవరి20:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దుబ్బాక నియోజకవర్గం పై ఎందుకు ఇంత వివక్ష అని, ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అవుతున్న నీళ్ల మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సిద్దిపేట జిల్లాలో పర్యటించకపోవడం విడ్డూరంగా ఉందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని కాల్వల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో కెసిఆర్ కృషితో కొండపోచమ్మ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ నిర్మాణం జరిగినట్లు గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం నీటిని విడుదల చేయకుండా రైతుల నోట్లో మట్టి కొడుతుందని ఆయన అన్నారు. రైతులు మల్లన్న సాగర్ పై ఎంతో ఆధారపడి ఉన్నారని గుర్తు చేశారు. తెలంగాణ నీళ్ల మంత్రి, ఉపముఖ్యమంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఇంతవరకు సిద్దిపేట జిల్లాలో పర్యటించకపోవడంపై విడ్డూరమన్నారు. రైతులు ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ముట్టడించేందుకు సిద్ధంగా ఉన్నారని నాని పేర్కొన్నారు. రైతుల నోట్లో మట్టి కొడుతున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కి, ఇరిగేషన్ మంత్రికి జిల్లాపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైనం నిర్ధాక్షణంగా కనబడుతుందని అన్నారు. తన సొంత డబ్బులతో కాల్వలను తీయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి స్పందించి కొండపోచమ్మ, రంగనాయక, మల్లన్న సాగర్లపై దృష్టి పెట్టి సిద్దిపేట జిల్లా రైతుల నీటి సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# పలు వార్డుల్లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

**రామాయంపేట, ఫిబ్రవరి 20 ( ప్రజా స్వరం )**

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పర్యటించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ నూతన పాలకవర్గం, అధికార బృందంతో కలిసి 11,12,5 వార్డులో పర్యటించారు. ఇటీవల వరదల కారణంగా ఇళ్లల్లోకి నీరు చేరడంతో ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ముంపు ప్రాంతాల సమస్య పరిష్కారం కోసం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆరు నెలల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ముంపు ప్రాంతాల్లో డ్రైనేజ్ నిర్మాణం చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు మున్సిపల్ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.



# మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఘనపూర్‌లో గ్యాస్ సిలిండర్ పేలుడు

**తూప్రాన్, ఫిబ్రవరి, 20 (ప్రజా స్వరం )**

మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఘనపూర్ గ్రామంలో దొడ్ల సతీష్ నివాసంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఘటన సమయంలో వంటగదిలో ఎవరూ లేకపోవడంతో కుటుంబ సభ్యులు తృటిలో ప్రాణాపాయం నుండి బయటపడ్డారు. అయితే, ఇంట్లో ఉన్న పూర్తి గృహ సామాగ్రి దెబ్బతిని తీవ్ర ఆస్తి నష్టం సంభవించింది. స్థానికుల సమాచారం ప్రకారం, గ్యాస్ లీకేజీ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఇటీవలి కాలంలో గ్యాస్ సిలిండర్ బుక్ చేసిన వెంటనే, సిలిండర్ గ్రామానికి చేరుతుందనే భయంతో కొందరు వినియోగదారులు స్వయంగా వెళ్లి తీసుకువచ్చి ఇంట్లో అమర్చుకుంటున్నారు. అయితే, సరైన విధంగా రెగ్యులేటర్ బిగించకపోవడం లేదా లీకేజీ ఉందో లేదో పరీక్షించకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నిపుణుల సూచనల ప్రకారం, గ్యాస్ సిలిండర్ సరఫరా చేసే సిబ్బంది ఇంటికే వచ్చి సిలిండర్ అమర్చడం, రెగ్యులేటర్ సరిగ్గా బిగించడం మరియు లీకేజీ ఉందో లేదో తనిఖీ చేయడం వారి బాధ్యత. వినియోగదారులు ఈ విషయంలో నిర్లక్ష్యం చేయకుండా, తప్పనిసరిగా సిబ్బందితోనే సిలిండర్ అమర్చించుకోవాలని సూచిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఇకముందు గ్యాస్ సిలిండర్ సరఫరా సమయంలో సరైన భద్రతా చర్యలు పాటించాలని స్థానిక నాయకులు కోరుతున్నారు. "గ్యాస్ సిలిండర్ తీసుకొచ్చిన వ్యక్తి ఇంట్లోకే వచ్చి రెగ్యులేటర్ బిగించి పూర్తిగా చెక్ చేసి వెళ్లేలా చూడాలి" అని వారు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదానికి దారితీస్తుందని గుర్తుంచుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-215, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/21, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2106/17154, CELL : 8008609999